సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 12 । జూలై । 2023



స్థల వివాదంతోనే స్థిరాస్తి వ్యాపారి హత్య

స్థల వివాదమే ప్రొద్దుటూరుకు చెందిన స్థిరాస్తి వ్యాపారి రామమోహన్‌రెడ్డి (48) హత్యకు కారణంగా పోలీసులు నిర్ధారణ చేశారు. - 8లో



స్క్రాప్ లోడ్‌లో గోవా మద్యం రవాణా

ఎస్ఈబీ అధికారులు చేపట్టిన దర్యాప్తులో స్క్రాప్ లోడ్‌లో అక్రమంగా గోవా మద్యం రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1220	రూ.1400
రెండోరకం	రూ.940	రూ.1200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 795 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	461	472
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 655.66 కిలోలు



న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఎల్ఐసీలో అడ్వయిజర్‌గా, రూరల్ కెరీర్ ఏజెన్స్, సిటీ కెరీర్ ఏజెన్స్‌లో పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు. టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి 18–35 ఏళ్లలోపు అర్హులని వివరించారు. వివరాలకు 9908051624 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

షాపింగ్ కాంప్లెక్స్ గదులకు బహిరంగ వేలం

చక్రాయపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం 44 షాపింగ్ కాంప్లెక్స్ రూములకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. 35 రూములకు సంబంధించి నెలకు రూ.3.21లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి తెలిపారు. దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఆలయ చైర్మన్ పి.రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీ ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ (154) కోఆర్డినేటర్ ఎం. వీరభద్రయ్య తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ జారీ అయినట్లు పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, ఓపన్ ఇంటర్, పాలిటెక్నిక్, డిప్లొమో కోర్సులు పూర్తి చేసినవారు ప్రవేశాలకు అర్హులని వివరించారు. ఈనెల 31వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఏడీసెట్-23 ప్రవేశాలు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏడీసెట్ (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)-23 ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ముగిసింది. సెట్ చైర్మన్, విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, కన్వీనర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మార్గదర్శనంలో నిర్వహించిన ఈ ఎంపికలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు విచ్చేసి ప్రవేశాలు పొందారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ ప్రవేశాల ప్రక్రియలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లో పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, శిల్పం కోర్సుల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

సక్రమ విధి నిర్వహణతో జిల్లాకు మంచిపేరు తేవాలి

రాయచోటి అర్బన్: బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడి నుంచి మరెక్కడికి బదిలీపై వెళ్లినా సక్రమంగా విధులు నిర్వర్తించడం ద్వారా జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య వైద్య ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని యండపల్లె పీహెచ్‌సీలో ఇటీవల బదిలీ అయిన 11మంది ఉద్యోగులకు మంగళవారం సాయంత్రం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైద్యశాఖ ఉద్యోగులు సహనం, ఓర్పును జీవితంలో భాగం చేసుకుని ప్రజలకు మంచి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శారద, అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, వైద్యశాఖ అధికారులు రియాజ్‌బేగ్,విష్ణువర్ధన్‌రెడ్డి, దేవశిరోమణి, ఓబుళరెడ్డి, సునీల్‌కుమార్ నాయక్, దివ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడికి ప్రభుత్వ ఆర్థిక సాయం



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న భాను ప్రకాష్‌తో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి

పెనగలూరు: మండలంలోని ఓబిలి పంచాయతీ, అత్తిగారిపల్లిలో నివాసం ఉంటున్న కాలువ భాను ప్రసాద్ (15) అనే యువకుడి కిడ్నీ మార్పిడికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి తెలిపారు. ఇటీవల కడప పర్యటనకు ముఖ్యమంత్రి వచ్చినప్పుడు డయాలసిస్ చేయించుకుంటున్న భానుప్రసాద్‌ను ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకెళ్లగా ముఖ్యమంత్రి ఈ మేరకు హామీ ఇచ్చారన్నారు. పదోతరగతి చదువుతున్న భాను ప్రసాద్ గత రెండు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతున్నాడు. తమ బిడ్డను బతికించాలని బాలుడి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అజ్ఞానవాసిపై ఆగ్రహజ్వాల

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై నిరసనలు మిన్నంటాయి. జిల్లావ్యాప్తంగా వలంటీర్లు రోడ్లపైకొచ్చి ఆందోళనలు చేశారు. పలుచోట్ల దిష్టిబొమ్మలు దహనం చేశారు. రీల్ లైఫ్‌లో నాలుగు డైలాగులు చెప్పి హీరోగా చెలామణి అయ్యే పవన్‌కల్యాణ్ రియల్ లైఫ్‌లో 'పచ్చ' పైత్యం ఎక్కువై పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. స్వచ్ఛంద సేవపై నీచంగా మాట్లాతున్న జనసేనాని నిజంగా 'అజ్ఞానవాసి'గా నిరూపించుకున్నాడన్నారు. వలంటీర్లకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

- 'పచ్చ'పైత్యంతో పిచ్చెక్కి మాట్లాడుతున్నాడు..
- ధ్వజమెత్తిన వలంటీర్లు
- బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్
- ఊరూవాడా నిరసనల వెల్లువ



రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పూలంగళ్ల సర్కిల్ వరకు వలంటీర్లు పవన్ దిష్టి బొమ్మ ను ర్యాలీగా తీసుకొచ్చారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్.. వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. పూలంగళ్ల సర్కిల్ వద్ద పవన్ కళ్యాణ్ దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టి నిప్పంటించారు.

కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

గాలివీడు: మండల కేంద్రంలో మండల ఉపాధ్యక్షులు యదుభూషన్‌రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. జేఏసీ సభ్యులు ఖాదర్ మొహిద్దీన్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు. కోడూరులో వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బద్వేలు అర్బన్: నిస్వార్థంగా సేవ చేస్తున్న తమపై జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చూస్తూ ఊరుకోమని వలంటీర్లు హెచ్చరించారు.

ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా వలంటీర్లు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. వలంటీర్ అసోసియేషన్ నాయకులు మహేశ్వరి, ప్రసన్న, సౌజన్య,సుబ్బయ్య పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

చాపాడు : చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో వలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎంపీపీ లక్ష్మయ్య మాట్లాడుతూ పవన్ వలంటీర్లపైన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

వలంటీర్ల నిరసన ర్యాలీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పట్టణంలో వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ గురప్ప, మండల ఉపాధ్యక్షుడు బాషా, మాజీ సర్పంచ్ బూతప్ప, ఎంపీటీసీ ఇస్మాక్, బాబు పాల్గొన్నారు.

చెప్పుతో కొట్టి..

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం నాలుగురోడ్ల కూడలిలో వలంటీర్లు పవన్ కళ్యాణ్ ఫొటోను చెప్పుతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు.

యాత్రలను అడ్డుకుంటాం

కమలాపురం : పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పకుంటే యాత్రలను అడ్డుకుంటామని వలంటీర్లు హెచ్చరించారు. పట్టణంలోని నిరసన వ్యక్తం చేశారు.

దమ్ములేక దుర్మార్గపు వ్యాఖ్యలా...

ఎర్రగుంట్ల : పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు సిగ్గు చేటని వలంటీర్లు ధ్వజమెత్తారు. మంగళవారం నిరసన తెలిపారు. దిష్టి బొమ్మను దహనం చేశారు.

అక్కసుతోనే పవన్ కల్యాణ్ ఆరోపణలు



సేవానిరతికి నిదర్శనంగా నిలిచే మాపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ లేనిపోని నిందలు వేస్తున్నారు. సేవాభావంతోనే ప్రభుత్వం వైపు నుంచి ప్రజలకు అందాల్సిన సేవలను దగ్గరుండి అందించాము. కరోనా సమయంలో, వర్షాలపుడూ వెనుకాడలేదు. వృద్ధులు వ్యాధుల బారినపడి ఆసుపత్రిలో ఉన్నా వారి వద్దకు సొంత డబ్బులు చార్జీలు పెట్టుకుని వెళ్లి పింఛన్లు ఇచ్చాము. ఎన్నికల్లో ఓటమి భయం, అక్కసుతోనే మాపై పవన్‌కల్యాణ్ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. ఆయన ఆరోపణలను ఏమాత్రం లెక్కలోకి తీసుకోము. జగనన్న ఆశయసాధనకు, ప్రజలకు అవసరమైన సేవలను స్వచ్ఛందంగా అందించేందుకు సిద్ధంగా ఉంటాం.

– శివలింగం సుధాకర్, చౌటుపల్లి గ్రామం, రవీంద్రనగర్ కాలనీ వలంటీర్, లక్కిరెడ్డిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా



ఎర్రగుంట్ల: పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



కమలాపురం: పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు నిప్పు పెడుతున్న వలంటీర్లు



గాలివీడు: దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పవన్‌వి దిగజారుడు వ్యాఖ్యలు: ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె(రాజంపేట): దేశానికి ఆదర్శంగా నిలిచిన వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం సుండుపల్లె సచివాలయం-1లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండి సేవలందించేవారి పట్ల పవన్‌కున్న అభిప్రాయం సరికాదన్నారు. తమ తమ పరిధిలో ఉన్న వారికి ఎలాంటి సమస్య వచ్చినా మేమున్నామంటూ భరోసా ఇచ్చిన వలంటీర్లను అగౌరవపరిచే విధంగా పవన్ మాట్లాడారన్నారు. కోవిడ్ నేపథ్యంలో వలంటీర్లు అందించిన సేవలు ప్రశంసనీయమని దేశవ్యాప్తంగా కొనియాడబడ్డారన్నారు. పవన్ ప్రజల్లోకి వెళితే సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

గ్రామాల్లోకి వచ్చి మా సేవలు తెలుసుకో

- పవన్‌కల్యాణ్‌కు వలంటీర్ల సవాల్

రైల్వేకోడూరు: వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలో వలంటీర్లు నిరసన తెలిపారు. స్థానిక టోల్‌గేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టి అనంతరం పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ వాహనమెక్కి నోటికొచ్చినట్టు మాట్లాడటం కాదు, చేతనైతే గ్రామాల్లోకి వచ్చి తాము చేస్తున్న సేవలను తెలుసుకోవాలని సవాల్ విసిరారు. మీ ఇంట్లో ఉన్న ఆడవారిని మాత్రమే గౌరవిస్తే సరిపోదు ప్రతి మహిళను గౌరవించాలనే సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో సొంత మనుషుల కంటే ఎక్కువగా కష్టపడి పనిచేశామని, ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజాము నుంచే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో 70 శాతం మహిళలకే వలంటీర్లుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రిని విమర్శించేందుకు నీకు సిగ్గు లేదా అని మండిపడ్డారు.

పుస్తక రూపంలో వలంటీర్ల సేవలు

- కుప్పం టు ఇచ్ఛాపురం వరకు నివేదిక
- ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ కన్వీనర్ కేఎంఎల్ నరసింహులు

రాజంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో భాగంగా వలంటీర్ల సేవలను సమీకరించి పుస్తకరూపంలో త్వరలో విడుదల చేయనున్నట్లు ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ కన్వీనర్, న్యాయవాది కేఎంఎల్ నరసింహులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థపై రెండేళ్లుగా కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని జిల్లాల్లో తిరిగి లబ్ధిదారులను కలుస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్నామన్నారు. దీనిపై ఒక నివేదిక కూడా సిద్ధం చేయనున్నామన్నారు. త్వరలో సమగ్ర సమాచారాన్ని పుస్తకరూపంలో తీసుకువస్తామని చెప్పారు. ఏమీ ఆశించకుండా సేవలందిస్తున్న వారు వలంటీర్లన్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో జన్మభూమి కమిటీలు ఐదేళ్లు ప్రజల రక్తాన్ని పీల్చిపిప్పి చేశాయన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటిలో వాటాలు దండుకునేవారన్నారు. కరోనా సమయంలో కుటుంబ సంబంధాలు కూడా తెగిపోయిన క్రమంలో వలంటీర్లు ముందుకొచ్చి ధైర్యంగా సేవలందించారని కొనియాడారు. గడపగడపకు వెళ్లి యోగక్షేమాలను తెలుసుకుని వారికి అవసరమైన ప్రభుత్వ సాయాన్ని అందజేయడం అభినందనీయన్నారు. ఇలాంటి వ్యవస్థ దేశంలో ఎక్కాడాలేదన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని రాజకీయాల కోసం విమర్శించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.



కేఎంఎల్ నరసింహులు

కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె: కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ మదనపల్లె పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై డివిజన్‌స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈనెల 13న మదనపల్లెలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ పర్యటిస్తున్న నేపథ్యంలో, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసులు పకడ్బందిగా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కేశవ్వ, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, డీఏఓ శేషయ్య, ఎంపీఐ దినేషచంద్ర, సీఐ మురళీకృష్ణ, ఎస్‌హెచ్, ఆర్అండ్‌బి, వైద్య ఆరోగ్యశాఖ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణలో పాలు పంచుకోవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములవుదామని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎన్‌జీఓ హోంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలన్నారు. జనాభా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక డైట్ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ,పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అలాగే విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శేషగిరిబాబు, రాయచోటి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మధుసూదన్ రెడ్డి, డీఎస్‌ఓ రియాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మీ ప్రేమ కోరే చిన్నారులం!

- 'అమ్మా..నాన్న.. నేను ఇంటిలో ఉండి చదువుకుంటాను. ఇంట్లో వాళ్లను వదిలి ఒక్క క్షణం కూడా ఉండలేను. చదువు పేరుతో నన్ను ఇంటి నుంచి దూరం చేయాలని చూడవద్దు. నాకు మీ ప్రేమానురాగాలు కావాలి. బాగా చదువుకుని టీచరై పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతాను' ఓ కుమార్తె అభ్యర్థన.
- 'నువ్వు హాస్టల్లో ఉండి చదవాల్సిందే. మంచి మార్కులు, ర్యాంకులు సాధించి డాక్టర్ కావాలి. తల్లిదండ్రుల సమాధానం'.

ఇదీ నేడు తల్లిదండ్రులు పిల్లల పట్ల వ్యవహరిస్తున్న తీరు. పిల్లల ఆలోచన, వారి అభిరుచులకు భిన్నంగా స్పందిస్తున్న విధానం. దీంతో పిల్లలు ఒంటరిగా హాస్టళ్లలో ఉండలేక ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. కొందరు ఆత్మన్యూనతా భావంతో పెరిగి పెద్దవారై ఒంటరితనానికి అలవాటు పడుతున్నారు.

- ప్రేమానురాగాలకు దూరమవుతున్న పిల్లలు
- తల్లిదండ్రుల నుంచి అందని అనురాగం
- ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ



మదనపల్లె సిటీ: జిల్లాలో జూనియర్ కాలేజీలో ఇంటర్మీయట్ తరగతులు ప్రారంభమయ్యాయి. చాలా మంది తమ పిల్లలను విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప వంటి నగరాల్లోని కార్పొరేట్, రెసిడెన్షియల్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. అక్కడ హాస్టళ్లలో ఉండలేక చాలా మంది ఇంటి బాటపడుతున్నారు. మరి కొందరు తల్లిదండ్రులు బలవంతంగా అక్కడే ఉండమని నచ్చచెబుతున్నారు. దీంతో విద్యార్థులు ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులకు ఎదురవుతున్నాయి.

- బాల్యం పిల్లలకు దేవుడిచ్చిన వరం. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య ఆడుతూ పాడుతూ, చిరునవ్వులు చిందిస్తూ బాల్యాన్ని ఆస్వాదించాలి. అప్పుడే బాల్యానికి సాకారం. ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం కుటుంబం నుంచి రావాలి. నేటి పోటీ ప్రపంచం, ప్రపంచీకరణ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల బాల్యాన్ని హరిస్తూ యాంత్రిక జీవనానికి అలవాటు చేస్తున్నారు. బాల్యంలోని మధురానుభూతులకు దూరం చేస్తున్నారు. పిల్లలను మార్కులు, ర్యాంకులను తయారు చేసే యంత్రాలుగా చూస్తున్నారు. దీని కోసం వారి ఇంటి నుంచి దూరంగా కార్పొరేట్ పాఠశాలల్లో బలవంతంగా చేర్పిస్తున్నారు. పాఠశాలలో స్నేహితుల సాన్నిహిత్యం ఉన్నా అమ్మ పంచే ప్రేమకు ఏదీ సాటిరాదు. నాన్న చూపే ఆదరణ ముందు ఏవీ సరితూగవు. దీంతో పిల్లలు తమలో తాము సంఘర్షణ పడుతూ జీవితాన్ని గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎప్పుడూ మార్కులు, ర్యాంకులే కాకుండా వారి కోసం కాస్త సమయాన్ని కూడా కేటాయించి ప్రేమను పంచాలని పిల్లలు తల్లిదండ్రుల నుంచి ఆశిస్తున్నారు. ఇదే విషయాన్ని మనోవ్యక్తిత్వ వికాస నిపుణులు కూడా వెల్లడిస్తున్నారు. లేనిపక్షంలో పిల్లల్లో భావవ్యక్తీకరణ నైపుణ్యం తగ్గడంతో పాటు అభద్రతా భావం పెరుగుతుందని చెబుతున్నారు. కౌమార దశలోని పిల్లలకు తల్లిదండ్రుల నుంచి సరైన ప్రేమానురాగాలు లభించకపోతే వారిలో మానసిక రుగ్మతలు చోటు చేసుకుంటాయని చెబుతున్నారు. ఆయా వయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులను సరిచేయక, సరైన మార్గదర్శనం చేయకపోతే పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని సూచిస్తున్నారు. కొందరు పిల్లలు తప్పటడుగులు వేసే ప్రమాదం కూడా లేకపోలేనది హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఏ చిన్న సమస్య ఎదురైనా అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

గతంలో అవ్వా, తాతలు, అమ్మానాన్నలు, చిన్నాన్న, పెద్దనాన్న, వారి పిల్లలతో కూడిన ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైంది. నేటి తల్లిదండ్రుల ఆలోచనా విధానంతో కనీసం కన్న బిడ్డలతో కూడిన సమష్టి కుటుంబ వ్యవస్థ కూడా మాయమైపోతోంది. పిల్లలను వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి ఒంటరి జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటున్నారు. సమాజంలో అనుబంధం, ప్రేమ, వాత్సల్యం అనే పదాలకు అర్థాలు కూడా మరచిపోతున్నారు.

మానసిక ఒత్తిడితో అనర్థాలు



చిన్నప్పటి నుంచే పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమైతే మానసిక ఒత్తిడి పెరిగి అనేక అనర్థాలకు దారి తీస్తాయి. ఆస్పత్రులకు వైద్య పరీక్షల కోసం వచ్చే విద్యార్థుల్లో అనేక మంది మానసిక ఒత్తిడితో పాటు మనోవేదనకు గురైన వారే ఉంటున్నారు. ఇంటికి, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నందున ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, పోషక విలువలు కలిగిన ఆహారం అందకపోవడంతో వ్యాధులకు గురవుతున్నారు.

–డాక్టర్ రాధిక, మానసిక వైద్య నిపుణురాలు, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె.

తల్లిదండ్రుల ధోరణి మారాలి



ఆధునిక జీవన విధానంలో అమ్మానాన్నల ఆలోచనా ధోరణి మారాలి. ప్రతిభా నైపుణ్యాలను బట్టి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. శారీరక, మానసిక పెరుగుదల వేగంగా జరిగే కౌమార దశలో పిల్లలకు కుటుంబంలోని ప్రత్యక్షానుభవాలు ఎంతో అవసరం. ఈ దశలో పిల్లలు ఎదుర్కొనే సంఘర్షణలను అమ్మానాన్నలు మాత్రమే అర్థం చేసుకోగలరు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించడమే కాకుండా వారికి ప్రేమానురాగాలు పంచాలి.

–జి.మోహన్‌వల్లి, అధ్యాపకురాలు, మహిళా డిగ్రీ కాలేజీ, మదనపల్లె.

తల్లిదండ్రుల అనురాగం అవసరం



బాల్యంలో చిన్నపిల్లలకు తల్లిదండ్రుల ప్రేమానురాగాలు చాలా అవసరం. తల్లిదండ్రులు ఎంత ఉద్యోగులైనా పిల్లల కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించాలి. ఒక వయస్సు వచ్చే వరకు పిల్లలు తల్లిదండ్రులతో కలిసి ఉండేలా చూడాలి. చదువంటే మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదనే విషయాన్ని గ్రహించాలి. పిల్లల అభిరుచి మేరకు వారిని ఎదగనివ్వాలి. వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి.

– టీఎస్‌ఏ కృష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ములకలచెరువు : ఒంటరిగా ఇంట్లో ఉన్న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గాయత్రి మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన విజయ్‌కుమార్(3) మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయంతో కేకలు వేయడంతో బాలికపై దాడి చేశాడు. అతని నుంచి తప్పించుకొని బయటకు వచ్చి కేకలు వేయడంతో పారిపోయాడు. కూలీ పనుల నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు జరిగిన విషయం బాలిక చెప్పింది. తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఎన్‌సీసీ విభాగాన్ని తనిఖీ చేసిన లెఫ్టినెంట్ కల్నల్


ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల)లోని ఎన్‌సీసీ విభాగాన్ని కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా మంగళవారం తనిఖీ చేశారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలతతో కలిసి ఆయన పరిశీలించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ వెంకటరమణ, క్యాడెట్లు గార్డ్ ఆఫ్ ఆనర్ సైనిక వందనంతో ఆహ్వానం పలికారు. అనంతరం ఎన్‌సీసీ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం బీ పాస్ సర్టిఫికెట్లను ఎన్‌సీసీ క్యాడెట్లకు అందజేశారు.

పగిలిన బస్సు టైరు.. తప్పిన ప్రమాదం


పగిలిన ఆర్టీసీ బస్సు టైరు

ములకలచెరువు : మదనపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు ప్రయాణికులతో వస్తుండగా ములకలచెరువు సరిహద్దులోకి రాగానే టైరు పగిలింది. ఒక్కసారిగా బస్సు ఊగిపోవడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. డ్రైవర్ కిరణ్‌కుమార్ చాకచక్యంగా బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఎదురుగా వస్తున్న వాహనాలు, రోడ్డు పక్కన చెట్లకు ఢీకొట్టకుండా బస్సును అదుపు చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో 20 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు.

స్థల వివాదంతోనే స్థిరాస్తి వ్యాపారి హత్య

- పంచాయితీకి పిలిచి దాడి చేసిన వైనం
- తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన రామమోహన్‌రెడ్డి
- నిందితుడు మేకల జగన్‌మోహన్ రెడ్డి ఎర్రగుంట్ల బీజేపీ మండల ఇన్‌చార్జి


మృతుడు రామమోహన్‌రెడ్డి


బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డితో కలిసి కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన మేకల జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : స్థల వివాదమే స్థిరాస్తి వ్యాపారి రామమోహన్‌రెడ్డి (48) హత్యకు కారణంగా పోలీసులు నిర్ధారణ చేశారు. పట్టణంలోని మోడంపల్లెకు చెందిన గుమ్మల్ల రామమోహనరెడ్డి సోమవారం రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. అతను ఆరోగ్యం సరిగా లేక మృతి చెందాడని పోలీసులు ముందుగా భావించారు. అయితే దాడికి గురై మృతి చెందినట్లు తర్వాత నిర్ధారణ అయింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మల్ల రామమోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులోని మోడంపల్లెలో సోదరి శాంతమ్మతో కలిసి ఉంటున్నాడు. అతనికి వివాహం కాలేదు. కొన్నేళ్ల నుంచి స్థలాల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో శాస్త్రీనగర్‌లో నివాసం ఉంటున్న మేకల జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన 5 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసే నిమిత్తం 11 ఏళ్ల క్రితం కొంత నగదు చెల్లించి అగ్రిమెంట్ రాయించుకున్నాడు. మిగిలిన మొత్తం చెల్లిస్తానని, రిజిస్టర్ చేయించాలని పలుమార్లు అడిగినా అతను పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. అగ్రిమెంట్ డబ్బు వాపసు ఇవ్వకుండా, రిజిస్టర్ చేయించకుండా అతన్ని ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ విషయమై రామమోహన్‌రెడ్డి బంధువుల వద్ద చెప్పుకుంటూ బాధపడేవాడు. స్థలం విషయమై అనేక సార్లు పంచాయితీలు కూడా జరిగాయి.

దేవగుడి రామాంజనేయరెడ్డి ఆఫీసులో దాడి

వివాదంగా ఉన్న స్థలానికి సంబంధించి పంచాయితీకి రావాలని పిలవడంతో సోమవారం సాయంత్రం రామమోహన్‌రెడ్డి జమ్మలమడుగు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి పక్కన ఉన్న దేవగుడి రామాంజనేయరెడ్డి ఆఫీసుకు వెళ్లాడు. అతనితోపాటు ప్రొద్దుటూరుకు చెందిన శేఖర్, భాస్కర్ అనే ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. అక్కడి కార్యాలయంలో రామమోహన్‌రెడ్డి, మేకల జగన్‌మోహన్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే జగన్‌మోహన్‌రెడ్డితోపాటు కొందరు వ్యక్తులు రామమోహన్‌రెడ్డిపై దాడి చేశారు. రామమోహన్‌రెడ్డికి గుండె దడ, షుగర్ వ్యాధి ఉన్నాయని అక్కడి వారు చెప్పినా అతను వదిలి పెట్టలేదు. వారి దాడిలో ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురైన రామమోహన్‌రెడ్డిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ చూసే లోపు అతను మృతి చెందాడు. తన తమ్ముడి చావుకు కారణమైన మేకల జగన్‌మోహన్‌రెడ్డితోపాటు మరి కొందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ నారాయణ యాదవ్ తెలిపారు.

ప్రధాన నిందితుడు ఎర్రగుంట్ల బీజేపీ ఇన్‌చార్జి

ఈ కేసులోని ప్రధాన నిందితుడు మేకల జగన్‌మోహన్‌రెడ్డి ఎర్రగుంట్ల మండలం బీజేపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. అతను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డికి ముఖ్య అనుచరుడు. ఆయన స్వగ్రామం కమలాపురం మండలంలోని సి రాజుపాళెం. ప్రస్తుతం ప్రొద్దుటూరులోని శాస్త్రినగర్‌లో నివాసం ఉంటూ రామేశ్వరంలో బార్ నిర్వహిస్తున్నాడు.

ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మొక్కల పంపిణీ


రైతులకు మొక్కలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

ఓబులవారిపల్లె : వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, తిరుపతి వారి ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు చీనీ నిమ్మ, అరటి మొక్కలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మండలంలోని పాపిరెడ్డిపల్లె, రాళ్ల చెరువుపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఒక్కో రైతుకు 600 మొక్కలను అందించడం జరిగిందన్నారు. రైతులకు ఎరువుల యాజమాన్యం, తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎల్.ముకుంద లక్ష్మీ, డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం. కవిత, రైతులు పి.శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి


మైదుకూరు : విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి

మైదుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరు మండలంలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వనిపెంటలోని జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్, భోజనాన్ని పరిశీలించారు. వనిపెంటలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, మైదుకూరులోని గాంధీ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మైదుకూరులో రెండు రేషన్ షాపులను తనిఖీ చేసి సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ బాలుర, బాలికల విభాగాలను తనిఖీ చేశారు. బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆయన స్వయంగా భోజనాన్ని వడ్డించారు. వసతుల గురించి ఎంఈఓ పద్మలత, హెడ్మాస్టర్ గంగా భవానితో మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ సురేష్, తహసీల్దార్ అనురాధ, డీటీ మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎర్రగుంట్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తర్వాత విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ విద్యార్థి తండ్రి పెట్టిన ఫిర్యాదు మేరకు వచ్చానన్నారు. ఇక్కడ భోజనం సరిగ్గా లేదని పిల్లలు తెలియజేశారన్నారు. తర్వాత పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డితో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు.

సరైన తూకంతో బియ్యం ఇవ్వాలి

పులివెందుల రూరల్ : ఎండీయూ ఆపరేటర్లు ప్రజలకు రేషన్ బియ్యాన్ని సరైన తూకంతో ఇవ్వాలని, ప్రతి ఏడాది త్రాసులకు మోహర్ వేయించుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీడీ సురేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, సీడీపీఓ శ్రీలత, ఎంఈఓ వీరారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, ఆర్ఐ సుజిత్, వార్డెన్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ లోడ్‌లో గోవా మద్యం రవాణా

- ఎస్ఈబీ అధికారుల విచారణలో వెల్లడి
- డంప్‌పై దాడి.. 1,760 బాటిళ్లు స్వాధీనం
- నలుగురి అరెస్ట్, రెండు వాహనాలు సీజ్


పట్టుకున్న మద్యం, వాహనాలు, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : తీగ లాగితే డొంక కదిలినట్లుగా.. ఎస్ఈబీ అధికారులకు దొరికిన గోవా మద్యం బాటిల్ ఆధారంగా దర్యాప్తు చేస్తే.. స్క్రాప్ లోడ్‌లో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. నిమ్మనపల్లె మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో ఏకంగా డంప్ బయటపడింది. మదనపల్లె ఎస్ఈబీ పరిధిలో జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు కర్ణాటక మద్యం లభించేంది. అలాంటిది తొలిసారిగా ఓ మారుమూల గ్రామంలో గోవా మద్యం లభించడంతో అధికారులు సైతం విస్తుపోయారు. ఇందుకు సంబంధించి ఎస్ఈబీ ఏఈఎస్ రాధాకృష్ణ వివరాలు వెల్లడించారు. నిమ్మనపల్లె మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి ఐచర్ వాహనంలో గోవా నుంచి గాజుముక్కల స్క్రాప్ లోడ్ వేసుకుని.. వాటి కింద ఎవరికీ అనుమానం రాకుండా వివిధ కంపెనీలకు చెందిన గోవా మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చి గ్రామంలో ఏర్పాటు చేసుకున్న స్టాక్‌పాయింట్‌లో ఉంచేవాడు. ఈ వ్యవహారంలో అదే గ్రామానికి చెందిన బాబాచారి సహకరించేవాడు. గ్రామంలో డంప్ చేసిన మద్యాన్ని తురకపల్లెలోని షేక్ నజీరాబేగం, సీటీఎంలోని విజయ్ ద్వారా మందుబాబులకు చేరవేసేవాడు. ఈ క్రమంలో ఎస్ఈబీ అధికారులకు లభించిన క్లూ ఆధారంగా దర్యాప్తు చేస్తే మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఎస్ఈబీ అధికారులు మంగళవారం నిమ్మనపల్లె మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో డంప్‌పై దాడి చేశారు. రూ.2 లక్షల విలువ చేసే 1,760 బాటిళ్ల (473 లీటర్లు) గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితులు రవాణాకు వినియోగించిన ఐచర్, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోవా మద్యం రవాణాలో కీలక సూత్రధారి చౌకిళ్లవారిపల్లె మల్లికార్జునరెడ్డి గతంలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ అంజాద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి ముగ్గురిపై దాడి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన కొమ్మెర శ్రీనివాసులు అతిగా మద్యం తాగి అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై సోమవారం దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన కొమ్మెర శ్రీనివాసులు, రాజశేఖర్‌ల మధ్య మాటకుమాట పెరగడంతో.. వారికి సర్దిచెప్పడానికి వెంకటరమణ, రమేష్ వచ్చారు. రాజశేఖర్‌తోపాటు వెంకటరమణ, తిరుపతి రమేష్‌పై శ్రీనివాసులు దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్


77 పరుగులు చేసిన భవానీప్రసాద్


5 వికెట్లు తీసిన బౌలర్ చినబాబు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో జరుగుతున్న ఏసీఏ-సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప 73 ఓవర్లలో 222 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని రణదీర్‌రెడ్డి 65, గురుచరణ్ 41 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ చిన్నబాబు 5, సుతేజ్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 56 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు 54.4 ఓవర్లలో చిత్తూరు జట్టు 191 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భవానీప్రసాద్ 77 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రతాప్‌రెడ్డి 3, లోహిత్‌సాయికిశోర్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 59, వీరారెడ్డి 50 పరుగులు చేశారు.

హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

రాయచోటి : రాజంపేట పట్టణ పరిధిలోని ఉర్దూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రఘురామకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు వెలువడ్డాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం మంగళవారం నోటీసులు జారీ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇంకా ఈ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయలేదన్న ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వెళ్లాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజంపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌కు వెళ్లి జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీపై ఆరా తీశారు. ఆయనకు సరైన సమాధానం చెప్పకపోవడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీఈఓ షోకాజ్ నోటీసును జారీ చేశారు.

బోడుమలదిన్నెలో వ్యక్తి దారుణ హత్య

- కాళ్లు, చేతులు కట్టేసిన వైనం
- గుర్తు తెలియని వ్యక్తులు గొంతు నులిమి చంపినట్లు అనుమానం


మృతి చెందిన రాజారెడ్డి

మదనపల్లె: గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతు కాళ్లు, చేతులు కట్టేసి గొంతు నులిమి దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోడుమలదిన్నె గ్రామానికి చెందిన సుబ్బరామిరెడ్డి కుమారుడు మంచూరి రాజారెడ్డి (62) భార్య జ్యోతితో కలిసి గ్రామానికి సమీపంలో నివసిస్తున్నాడు. వ్యవసాయం చేస్తూ, పాడి ఆవులను పోషిస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పాలు పితికిన అనంతరం గ్రామంలోని పాల సెంటర్లో పాలు పోసి ఇంటికి వెళ్లాడు. తరువాత 8.30 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న చెరువు మరువ వద్ద, తాను నివసిస్తున్న ఇంటికి సమీపంలోనే, కాళ్లు చేతులు కట్టి వేయబడి పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. చేతులను తాళ్లతో కట్టి వేయడం, కాళ్లను రాజారెడ్డి ధరించిన పంచతో కట్టి ఉండటం, గొంతుకు టవల్ బిగించి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని తాలూకా పోలీసులకు అందించారు. ఈ లోపుగా పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు సంఘటనా స్థలం వద్ద గుమికూడారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో మృతుడు గ్రామ నివాసి రాజారెడ్డిగా గుర్తించారు. ఎందుకు హత్య చేశారన్న విషయం అంతు చిక్కడం లేదు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. స్థానికులు, కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. అయితే మృతదేహం పడి ఉన్న తీరు, చేతులు, కాళ్లు కట్టి పడవేయడం, గొంతుకు టవల్ చుట్టి ఉండటం, మృతుడి నోటి నుంచి రక్తం కారుతుండటాన్ని బట్టి.. గుర్తు తెలియని వ్యక్తులు గొంతు నులిమి హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. అయితే మృతునికి గ్రామంలో గానీ, చుట్టుపక్కల గానీ ఎటువంటి శత్రుత్వం, వివాదాలు లేవని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల దర్యాప్తులో వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతునికి భార్య జ్యోతితోపాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వీరికి వివాహం కాగా ఒకరు బెంగళూరులో, మరొకరు చిత్తూరు జిల్లా సదుం గ్రామంలో నివసిస్తున్నారు. రాజారెడ్డికి మరో ఇద్దరు సోదరులు రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు. వీరిలో రామకృష్ణారెడ్డి మదనపల్లి పట్టణంలో లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ నిర్వహిస్తుండగా, సుధాకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. రాజారెడ్డి దారుణ హత్య వార్త చుట్టుపక్కల గ్రామాలకు వెంటనే వ్యాపించింది. పెద్ద సంఖ్యలో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ప్రవాసాంధ్రులకు అందిస్తున్న సేవలు మరువలేనివి


వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యే

కడప కార్పొరేషన్ : గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ అందిస్తున్న సేవలు మరువలేనివని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో ఎన్నారైలు అన్సర్ బాషా, షేక్ గయాజ్, బాబుబాయ్, ఉస్మాన్‌బాషా, రాజాసాబ్‌ల ఆధ్వర్యంలో రెండోసారి గల్ఫ్ కన్వీనర్‌గా నియమించినందుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులను ఏకం చేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఇలియాస్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం బీహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ ఎన్నారై గ్రూప్ సహకారంతోనే తాను ఏపీఎన్ఆర్‌టీఎస్‌లో సేవలందించానన్నారు. ఏ పార్టీలో దక్కని గౌరవం తనకు వైఎస్సార్‌సీపీలో లభించిందన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అందించిన సహకారం ఎంతో ఉందన్నారు. గల్ఫ్ దేశాలలో ప్రవాసాంధ్రులకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు, ప్రమాదాలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపుతున్నారని, ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎస్.మహేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అఫ్జల్‌ఖాన్, హఫీజుల్లా, డాక్టర్ సొహైల్, కె. సూర్యనారాయణరావు పాల్గొన్నారు.

13న గండికోటలో 'అల్లూరి' వర్ధంతి

కడప కల్చరల్ : స్వాతంత్ర్య సమర పోరాటంలో ఆంగ్లేయులకు సింహస్వప్నంగా నిలిచిన అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఈనెల 13న ప్రముఖ పర్యాటక ప్రాంతం గండికోటలో నిర్వహించనున్నారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్, తంజావూరు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, అమరావతి సర్కిల్, విజయవాడల ఉమ్మడి నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడప సబ్ సర్కిల్ ఆర్కియాలజీ కన్జర్వేషన్ అసిస్టెంట్ పి.బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వాహక బృందంలోని అధికారులు జిల్లా అధికారులను కలిసి అనుమతులు, ఏర్పాట్లపై చర్చించారు. ఈనెల 13న అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు, ఇందులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. సాయంత్రం 3.30 గంటలకు గండికోట ప్రధాన ద్వారం వద్ద నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులు, పర్యాటకాభిమానులు, స్థానిక ప్రజలతో కోటలోని జుమ్మా మసీదు వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జుమ్మా మసీదు వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగంగా విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వారికి వ్యాసరచన, క్విజ్, రంగోలి తదితర పోటీలను ఏర్పాటు చేసి ఉత్సవాల వేదికపై బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా విశ్వవిఖ్యాత నాటక సమాజం, మన జిల్లాకు చెందిన సురభి కళాకారుల ప్రతినిధి ఆనంద్ బృందం నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వారితోపాటు మన జిల్లాలోని మైదుకూరు వద్దగల పార్వతీనగర్‌కు చెందిన కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.